www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 25 ఆగస్టు 2025
5
అన్నమయ్య



నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

'గోకులం'బిల్లుల కోసం ఎదురు చూపులు



అధికారుల చుట్టూ ప్రదక్షిణలు | **నెలల తరబడి పాడిరైతుల నిరీక్షణ**

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో గోకులాలు, మినీ గోకులాల నిర్మాణాలకు 2024లో శ్రీకారం చుట్టింది. వీటి ద్వారా పాడిరైతులకు ఆర్థిక స్వాలంబన అందివ్వాలన్నదే ప్రధాన ఉద్దేశంగా పెట్టుకుని నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం నిధులతో వీటి నిర్మాణాలను చేపట్టారు. ప్రభుత్వ ఆలోచనకు అధికారుల చిత్తశుద్ధి తోడై వేగవంతంగా వీటినిర్మాణాలు సాగాయి. అధిక శాతం నిర్మాణాలు గతేడాది అక్టోబరు, నవంబరు మాసాల్లో ప్రారంభించి, డిసెంబరు చివరికి పూర్తయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు జనవరిలో వీటిని పండుగ వాతావరణంలో ప్రారంబోత్సవాలు చేసుకున్నారు. అయితే అధికారులు గోకులాల నిర్మాణాలపై చూపిన శ్రద్ధ వాటి బిల్లుల చెల్లింపులో చూపకపోవడం గమనార్హం. గోకులాలు నిర్మించుకున్న రైతులు వారికి అందాల్సిన బిల్లుల చెల్లింపులో చోటు చేసుకుంటున్న జాప్యంతో ఆందోళనకు లోనౌతున్నారు. గోకులాలు నిర్మించుకున్న తర్వాత కేవలం తొలి విడత బిల్లులు మాత్రమే చెల్లించారని, నెలలు గడుస్తున్నా మిగిలిన బిల్లుల విషయంలో సంబంధిత అధికారులు పొంతనలేని సమాధానాలతో కాకమ్మ కథలు చెబుతున్నారన్న ఆవేదనను పాడిరైతులు వ్యక్తం చేస్తున్నారు.



అందంగానిర్మించుకున్న మినీ గోకులం

2018లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం అప్పట్లో పాడి రైతులను ఆదుకునేందుకు గోకులం పథకం తీసుకువచ్చి మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు చేపట్టింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ పథకానికి స్వస్తి పలికింది. గోకులాల నిర్మాణాలకు నిధులు విడుదల కాకపోవడంతో లబ్ధిదారులెవరూ ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గోకులం పథకాన్ని తిరిగి ప్రారంభించి షెడ్ల నిర్మాణాలు చేపట్టింది. పశు వులపోషకులకు 90 శాతం రాయితీ, పశువులు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం రాయితీతో షెడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు ప్రకటించింది. పీలేరు నియోజకవర్గంలో అధిక శాతం మంది రైతులు రూ.2.30 లక్షలు విలువజేసే 6 ఆవుల షెడ్లను నిర్మించుకున్నారు. రెండు ఆవుల యూనిట్ విలువ రూ.1.15 లక్షలు కాగా ఇందులో ఉపాధి నిధులు రూ.1.03 లక్షలు, పాడిరైతు వాటా రూ.11,500లు, నాలుగు ఆవుల యూనిట్ విలువ రూ.1.85 లక్షలు కాగా ఇందులో ఉపాధి హామీ నిధులు రూ.1.66 లక్షలు, రైతు వాటా రూ.18,500లు, అలాగే ఆరు ఆవుల షెడ్ యూనిట్ విలువ రూ.2.30 లక్షలు కాగా ఇందులో ఉపాధి నిధులు రూ.2.07 లక్షలు, రైతు వాటా రూ.23 వేలుగా కేటాయించారు. 20 జీవాల యూనిట్ విలువ రూ.1.30 లక్షలైతే దీనికి ఉపాధి నిధులు రూ.91 వేలు కాగా రైతు వాటా రూ.39 వేలు. 50 జీవాల యూనిట్ విలువ రూ.2.30 లక్షలు కాగా రూ.1.61 లక్షల ఉపాధినిధులకు, రూ.69 వేలు రైతు వాటా ఉంటుంది. 100 కోళ్ల యూనిట్ విలువ రూ.87 వేలకు ఉపాధి నిధులు రూ.61 వేలు, రైతు వాటా రూ.26 వేలు ఉంటుంది. 200 కోళ్ల షెడ్ యూనిట్ విలువ రూ.1.31 లక్షల్లో రూ.92 వేలు ఉపాధి నిధులు రూ.30 వేల రైతు వాటా ఉంటుంది.

పీలేరు నియోజకవర్గం పరిధి లోని ఆరు మండలాలకు ప్రభుత్వం 264 గోకులాలు మంజూరు చేసింది. పీలేరు మండలానికి 51 గోకులాలు మంజూరు కాగా వాటి నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటిలో 27 మంది లబ్ధిదారులకు రెండు నెలల పాక్షికంగా బిల్లులు మంజూరయ్యాయి. మిగిలిన 24 మందికి ఎలాంటి బిల్లులూ మంజూరు కాలేదు. రెండున్నర నెలలుగా ఉపాధి చట్టం నుంచి చెల్లింపులు ఆగిపోవడంతో అధికారులు సైతం చేతులెత్తేశారు. మిగిలిన బిల్లులు ఎప్పుడు వస్తాయా అని రైతులు ఎదురుచూస్తున్నారు. అధికారుల ప్రోత్బలంతో రైతులు తమ చేతిలో డబ్బు ఉన్నా లేకున్నా బిల్లులు త్వరగా వస్తాయన్న ఆశతో చాలా మంది షెడ్లను నిర్మించుకున్నారు. ఏడు నెలలు దాటుతున్నా బిల్లులు ఇంకా చేతికి అందకపోవడంతో వారు ఆందోళనకు లోనౌతున్నారు. బిల్లుల సంగతి ఎలా ఉన్నా గోకులం పథకం కారణంగా తమ పాడిపశువులకు మేలు జరిగిందని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అవి తలదాచుకోడానికి తగిన చోటు సమకూరిందని పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కలికిరి మండలానికి 26 గోకులాలు మంజూరు కాగా వాటిలో 26 పూర్తయ్యాయి. కానీ వాటికి చెల్లించిన బిల్లులు మాత్రం సగమే. కెవి పల్లె మండలానికి 48 గోకులాలు మంజూరు కాగా వాటిలో 33 పూర్తయ్యాయి. మరో 15 గోకులాలు ప్రారంభానికి నోచుకోలేదు. గుర్రంకొండ మండలానికి 58 గోకులాలు మంజూరు కాగా వాటిలో 55 పూర్తయ్యాయి. పూర్తయిన వాటికి చెల్లించిన బిల్లులు కూడా సగమే.

బిల్లులు సకాలంలో చెల్లించి ఆదుకోవాలి



గోకులం పథకం ద్వారా నిర్మించుకున్న షెడ్డులో మా ఆవులు సురక్షితంగా ఉంటున్నాయి. ఈ పథకం ద్వారా పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. పథకానికి ఆకర్షితులై షెడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులైన రైతులు అప్పుల పాలు కాకుండా బిల్లులు సకాలంలో చెల్లించి ఆదుకుంటే బాగుంటుంది.

- రామచంద్రారెడ్డి, తుమ్మలవారిపల్లె, పీలేరు మండలం.

పాడిరైతులను కాస్త పట్టించుకోవాలి



గోకులం షెడ్లతో పాడి ఆవులకు మంచి రక్షణ సాధ్యమైంది. షెడ్లు లేనప్పుడు పశువులను ఆరుబయటే కట్టుకునే వాళ్లం. ఇప్పుడు ఆ సమస్యలేదు. ఎండా, వాన భయంలేదు. ఎలాంటి చింతాలేకుండా షెడ్డులోనే కట్టుకుంటున్నాం. ప్రభుత్వం రైతుల పరిస్థితి కాస్త అర్థం చేసుకుని పెండింగ్‌లో ఉన్న బిల్లుల గురించి కూడా కాస్త పట్టించుకుంటే మాకు మేలు జరుగుతుంది.

- శ్రీరాములు, బోడుమల్లువారిపల్లె, పీలేరు మండలం.

రైతులు ఆందోళన పడాల్సిన పనిలేదు

గోకులం షెడ్ల పెండింగ్ బిల్లుల గురించి రైతులు ఆందోళన పడాల్సిన పనిలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. స్థానికంగా మేము బిల్లులు సిద్ధంచేసి పెట్టుకున్నాం. ఉన్నతాధికారుల నుంచి నిధులు, అనుమతులు అందిన వెంటనే వాటిని ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తాం. రైతుల బిల్లులు వారి వారి బ్యాంకు ఖాతాలోనే జమవుతాయి. కాస్త ఆలస్యమైనా బిల్లులు మాత్రం తప్పక వస్తాయి. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు.

- అశోక్ కుమార్‌రెడ్డి, ఎపిఒ, పీలేరు మండలం.



మాట్లాడుతున్న జిల్లా సాధన కమిటీ సభ్యులు

రాయచోటినే జిల్లా కేంద్రంగా కొనసాగించాలి

-జిల్లా సాధన సమితి

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి నుంచే అన్నమయ్య జిల్లా కొనసాగాలని రాయచోటి అన్నమయ్య జిల్లా సాధన సమితి డిమాండ్ చేసింది. జిల్లా కేంద్రాన్ని ఇతర ప్రాంతానికి తరలించాలన్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తూ, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను సహించమని స్పష్టం చేసింది. ఆదివారం రాయచోటి సాయి సుభ కళ్యాణ మండపంలో జరిగిన అత్యవసర సమావేశంలో వివిధ సంఘాల నాయకులు, విద్యావేత్తలు, ప్రజా ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ రాయచోటి అన్నమయ్య జిల్లా హృదయ భాగం ఇది భౌగోళికంగా జిల్లా మొత్తానికి కేంద్రంగాఉండడంతో గత ప్రభుత్వం రాయచోటిని జిల్లా కేంద్రం చేసిందన్నారు. మౌలిక వసతులు కలిగిన పట్టణంగా ఇది వేగంగా అభివృద్ధి చెందుతోంది. జిల్లా కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయాలు, 98 శాఖల కార్యాలయాలు రాయ చోటిలో శరవేగంగా ఏర్పాటు చేయబడ్డాయని అన్నారు. జిల్లా కలెక్టరేట్ ,తదితర ప్రభుత్వ కార్యాలయాల పక్కా భవనాల కోసం వేలాది ఎకరాల భూములు కూడా సిద్ధంగా ఉన్నా యన్నారు. ఇది అభివృద్ధి మార్గంలో ఉన్న పట్టణం యాభై ఏళ్లకు తగ్గట్లుగా తాగునీటి వసతులు కూడా ఏర్పాటయ్యాయిన్నారు. ఇలాంటి తరుణంలో జిల్లా కేంద్రాన్ని తరలించాలన్న ఆలోచన రాజకీయం మినహా మరేమీ కాదు అని తీవ్రంగా మండిపడ్డారు. సిఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రాయచోటినే జిల్లా కేంద్రంగా కొనసాగిం చాలని వారు కోరారు. ప్రజా విశ్వాసాన్ని నిలబె ట్టుకోవాలంటే హామీలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాయచోటి ఎమ్మెల్యే, మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డిప్రత్యేక శ్రద్ధ పెట్టి, ముఖ్యమంత్రి తో జిల్లా కేంద్రం మార్పును అడ్డుకోవాలని సమితి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, సామాన్యులు రాయ చోటిని జిల్లా కేంద్రంగా నిల బెట్టుకోవడానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అవస రమైతే ఉద్యమానికి సిద్ధం కావాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా సాధన సమితి గౌర వాధ్యక్షుడు బయారెడ్డి, సంఘ అధ్యక్షుడు నాగిరెడ్డి, మదనమోహన్ రెడ్డి (అర్చన స్కూల్), శ్రీనివాసులు రెడ్డి (డిగ్రీ కళాశాల), విజయభాస్కర్ (బీసీ సెల్), గంగిరెడ్డి (ప్రతిభ స్కూల్), రామా ంజులు సాయిసుభ కళ్యాణ మండపం అధినేత ప్రకాష్, మైనారిటీ నేత ఇర్షాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమపల్లె రామ్ ప్రసాద్ రెడ్డి, న్యాయవాది రెడ్డెప్పరెడ్డి, భాస్కర్ రాజు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను చూపుతున్న వైస్ ఛాన్సలర్లు

హార్టికల్చర్ యూనివర్సిటీతో 'మిట్స్'ఒప్పందం

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని డీమ్డ్ టుబి యూనివర్సిటీలో పశ్చిమ గోదావరి జిల్లా, వెంకటరామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీతో అనుబంధ ఒప్పందం కుదుర్చుకున్నట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లు డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా పరస్పర ప్రయోజనాల కోసం ఉమ్మడి ఆసక్తి ఉన్న రంగాలలో విద్య, పరిశోధన, అభివృద్ధిలో అంతర్-సంస్థాగత సహకారాన్ని పెంపొందించడానికి ఈ రెండు సంస్థలు మధ్య ఒక సాధారణ ఒప్పందాన్ని ఏర్పాటు చేయడం ఈ అవగాహన ఒప్పందంముఖ్య లక్ష్యమన్నారు. ఈ ఒప్పందం ప్రకారం, రెండు సంస్థలు అనేక వినూత్న రంగాలలో సహకరిస్తాయన్నారు. వీటిలో ఉత్పత్తి అంచనా, క్షితిజ సమాంతర స్ప్రేయింగ్, పోషక పంపిణీ వంటి ఉద్యానవన అనువర్తనాల కోసం డ్రోన్ అనుకూలీకరణ, నీటి స్థాయిల ఆధారంగా పొలాలలో ఆటోమేటిక్ నీటి విడుదల కోసం సోలేనాయిడ్ వాల్వ్‌ల అభివృద్ధి, ఇమేజ్ ప్రాసెసింగ్-ఆధారిత కలుపు నిర్వహణ పరిష్కారాలు, మల్చింగ్, పండ్ల పూతలకు బయో డిగ్రేడబుల్ పదార్థాల వాడకం, సమర్థవ ంతమైన పంట నిర్వహణ కోసం నానో-ఆగ్రో ఇన్‌పుట్‌ల సంశ్లేషణ, సమర్థ వంతమైన వ్యవసాయ నిర్వహణ కోసం మొబైల్-ఆపరేటెడ్ గడ్డి కట్టర్లు వంటివి ఈ ఒప్పందం లో ముఖ్య అంశాలన్నారు. ఈ ఒప్పందం ద్వారా డ్రోన్‌లు, ఎఐ, ఐఒటి లాంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞా నాలను ఉద్యానవనంలో ఏకీకృతం చేయడానికి వీలు కల్పిస్తుందని తెలిపారు. తద్వారా రైతులకు ప్రయో జనం చేకూరుతుందని రాష్ట్రంలో ఉద్యానవన పంటల వాణిజ్యీకరణ, ఉత్పాదకత పెంపునకు దోహదపడుతుందని ఆయన చెప్పారు. వ్యవసాయ సమాజానికి అత్యాధునిక పరిష్కారాలను అభివృద్ధి చేయాలనే దార్శనికతకు అనుగుణంగా, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు మరియు పరిశ్రమ-విద్యా సహకా రాన్ని ప్రోత్సహించడంలో ఈ భాగ స్వామ్యం ఒక ముఖ్యమైన అడుగన అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందంలో అడ్వైజర్ ఆర్‌డి డాక్టర్.తులసిరామ్‌నాయుడు, అసోసియేట్ డీన్ డాక్టర్ శివయ్యలు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం

డిఎస్‌పి మహేంద్ర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

యోగా ఆసనాలు వేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని మదనపల్లె డిఎస్‌పి మహేంద్ర అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం డిఎస్‌పి కార్యాలయం ఆవరణలో డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, కానిస్టేబుల్స్ యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పోలీసు సిబ్బంది అంతా ఒకచోట చేరి యోగాసనాలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. మనం నిత్యం విధుల ఒత్తిడిలో ఉండడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో యోగా మనకు ఒక గొప్ప పరిష్కారం చూపుతుందన్నారు. యోగా కేవలం శారీరక వ్యాయామం కాదని, అది మన మనసును ప్రశాంతంగా ఉంచి, ఏకాగ్రతను పెంచు తుందన్నారు. శరీరానికి బలాన్ని ఇచ్చి రోగ నిరోధక శక్తిని పెంచుతాయన్నారు. ముఖ్యంగా ఒత్తిడిని తగ్గించి, మానసిక ప్రశాంతతను అంది స్తాయన్నారు. ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా ఆరోగ్యవంతమైన జీవన శైలిని అలవర్చుకునేందుకు రోజూ యోగా, ఇతర వ్యాయామాల కోసం కొంత సమయం కేటాయి ంచాలన్నారు. అందుకోసం యోగాను మన దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐలు రఫీ, కళావెంకట్రమణ, డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

'సురవరం' సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డి మృతి, ప్రగతిశీల, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని విడుదలై విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బాస్ కార్యాలయం వద్ద విసికె పార్టీ, భారతీయ అంబేద్కర్ సేన సంయుక్తంగా సంస్మరణ సభ నిర్వహించాయి. ఈ సందర్భంగా సురవరం చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి నుంచి కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని, తన తండ్రి నుంచి స్వాతంత్ర పోరాట స్ఫూర్తిని అందిపుచ్చుకొని అసమానతల అంతం కోసం తుది శ్వాసవరకు అలుపెరుగని పోరాటం చేసిన విప్లవ యోధుడని కొనియాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శిగా, రెండు పర్యాయాలు లోక్‌సభ సభ్యులుగా పనిచేసిన ఆయన దేశానికి చిరస్మరణీయమైన సేవలు అందించారన్నారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో బాస్ రాష్ట్ర అధ్యక్షుడు యు.గణపతి, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్, రాష్ట్ర కోశాధికారి నీరుగట్టి రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. దొరస్వామి తోపాటు స్థానిక వీసీకే, బాస్ నాయకులు బయన్న, రెడ్డెప్ప, డేగాని రమణ, జి.వి.రమణ, రవిశంకర్, గంగాధర్, బండకోట రవి, తలారి కృష్ణ, తెట్టు శ్రీనివాసులు, వినోద్, గోపి, మహేంద్ర పాల్గొన్నారు.

చేనేతలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఆర్. పవన్ కుమార్‌రెడ్డి



ముఖా ముఖి..

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలోని చేనేత కార్మికులకు, వారి కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చసుకోవాలని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి ఆర్. పవన్‌కుమార్‌రెడివ్డ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో చేనేత కార్మికులు ఎంతమంది ఉన్నారో, వారి కుటుంబాలు ఆర్థిక అభివృద్ధి ఎలా పొందాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో చేనేత అధికారులు, కార్యాలయాల వివరాలు తెలపండి?

రాయచోటిలో కలెక్టరేట్ కార్యాలయం వద్ద మైనారిటీ గర్ల్స్ హాస్టల్ భవనంలో జిల్లా చేనేత కార్యాలయం ఉంది. జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి అర్. పవన్ కుమార్‌రెడ్డి, సహాయ అబివృద్ధి అధికారి జి.వెంకట్ కుమార్, సహాయ అభివృద్ధి అధికారి కె.ప్రవీణ్ కుమార్ రాజు ఉన్నారు.

చేనేత అధికారుల పని వివరాలు తెలపండి?

జిల్లాలోని చేనేత సంఘాలకు, చేనేత కార్మికులకు సంబంధించిన పథకాల అమలు తీరును పర్యవేక్షిస్తాం. జిల్లాలో సొసైటీలో ఉన్న చేనేత కార్మికులందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారి అర్హతను బట్టి చేనేతలకు అందజేస్తున్నాం.

జిల్లాలో మగ్గాలు, చేనేతకుటుంబాల వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లలో ప్రస్తుతం రమారమి 11 వేల మగ్గాలున్నాయి. 9 వేల చేనేత కుటుంబాలున్నాయి. వీరబల్లి, పుల్లంపేట, రాజంపేట, చిన్న మండెం, మదనపల్లిటౌన్, రూరల్, కురుబలకోట, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, మొలకలచెరువు, నిమ్మనపల్లి, కలకడ, పీలేరు ప్రాంతాల్లో చేనేత పరిశ్రమలున్నాయి.

జాతీయ చేనేత క్లస్టర్ పథకాలు వివరాలు తెలపండి?

ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో అంగళ్ళు, మదనపల్లిలో 5 చేనేత క్లస్టర్ పథకాలను అమలుచేస్తున్నాం. అంగళ్ళు చేనేత క్లస్టర్, అంగళ్ళు, కురబలకోట మండలం. రాజానగర్ చేనేత క్లస్టర్, మదనపల్లి పట్టణం,నీరుగట్టువారిపల్లి, చేనేత క్లస్టర్, మదనపల్లి పట్టణం, కోళ్లబైలు చేనేత క్లస్టర్, మదనపల్లి రూరల్, చౌడేశ్వరిదేవి చేనేతక్లస్టర్, మదనపల్లి రూరల్ ప్రాంతాలలో ఉన్నాయి.

చేనేత కార్మికులకు ప్రభుత్వం ఏమైనా రుణాలు మంజూరు చేస్తుందా?

చేనేత కార్మికులకుముద్ర పథకం కింద రూ.50 వేలు నుండి రూ.5 లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 43 మంది చేనేత కార్మికులకు రూ.52.62 లక్షల రుణాలను మంజూరు చేశాం.

చేనేతకార్మికులకు పనిముట్లు అందజేస్తున్నారా?

జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి చేనేత కార్మికులకి చేనేత క్లస్టర్ పథకం ద్వారా పనిముట్లు అందజేస్తున్నాం. అన్నమయ్య జిల్లలో ప్రస్తుతము 59 చేనేత సహకార సంఘాలున్నాయి.

చేనేత కార్మికులకు పెన్షన్ ఇస్తున్నారా?

అన్నమయ్య జిల్లాలో మొత్తంగా ప్రస్తుతం 3,695 మంది చేనేత కార్మికులకు పెన్షన్ అందజేస్తున్నాం. ప్రతి నెలా ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున పెన్షన్ అందజేస్తున్నాం.

చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నారా?

ఆగస్టు 7న విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. చేనేతలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్తును పొందవచ్చును.

చేనేతకార్మికులకు సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటున్నారా?

ప్రభుత్వం అందజేసే అన్ని పథకాలను చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి. అదేవిధంగా ముద్ర రుణాలను నిర్ణీత సమయంలో చెల్లించాలి. జిల్లాలోని చేనేత కార్మికులు ఎవరూ మధ్యవర్తులను సంప్రదించరాదు. ఎవరికైనా ఏమైనా సమస్యలు ఉంటే తమ కార్యాలయాలకు వచ్చి సమస్యల పరిష్కరించుకోవచ్చు.

రేపు మట్టి గణపతి బొమ్మలు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణంలోని సాయి నగర్‌కు చెందిన సుంకర సుబ్బరాయుడు, వారి కుటుంబ సభ్యులు, మన్నూరుకు చెందిన గంగ నపల్లి వెంకటరమణ, హైమావతి దంపతులు మంగళవారం ఉదయం 10 గంటలకు మట్టి గణపతి బొమ్మలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌టిసి బస్టాండ్ పక్కన గల సాయిబాబా గుడి వద్ద సుంకర సుబ్బరాయుడు, మన్నూరు మెయిన్ రోడ్డు రామా లయం వద్ద గంగనపల్లి వెంకటరమణ దంపతులు పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మట్టి గణపతి బొమ్మలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షి ంచుట కేవలం ఒక వ్యక్తి ధర్మమే కాదని, అది కుటుంబ, సమాజధర్మం కూడా అని పేర్కొన్నారు. మట్టి గణపతులే మహాగణపతులని, వాటి వల్ల పర్యావరణం కలుషితం కాదని, మట్టి గణపతుల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావడం కోసమై తాము గత కొన్నేళ్ళుగా ఉచిత మట్టి గణపతి బొమ్మలను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.

ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన 'మండిపల్లి'

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి ఆదివారం రాయచోటి పట్టణానికి వచ్చిన సందర్భంగా రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి సుపరిపాలన గురించి ఇరువురు మంత్రులు చర్చించారు.

బిజెపి చేతిలో జగన్ కీలుబొమ్మ : పిసిసి

ప్రజాశక్తి-రాయచోటి

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థి రాధాకృష్ణన్‌కు మద్దతు ప్రకటి ంచాలని వైసిపి నిర్ణయించడం ద్వారా జగన్ నిజ స్వరూపం మరోసారి బహిర్గతమైందని, బిజెపి చేతిలో జగన్ కీలుబొమ్మ అని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణలో అయన మీడియా సమా వేశంలో మాట్లాడారు. బిజెపి చేతిలో జగన్ బొమ్మ అని ,కబాలి అని మరోసారి రుజువు అయిందని తులసిరెడ్డి అన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను జగన్ బలి పెడతాడని మరోసారి నిరూపిత మైందిన్నారు. రాష్ట్రానికి సంజీవని ఇలాంటి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, రాయలసీమకు ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు ఇవ్వకుండా కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయకుండా, దుగరాజ పట్నం ఓడరేవు నిర్మించకుండా మోసం చేశార న్నారు. రాజధానికి గ్రాంట్ ఇవ్వకుండా, విశాఖ పట్నం స్టీల్ ప్లాంటును ప్రయివేట్ పరం చేయాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తూ ఉంటే ఈ నేపథ్యంలో బిజెపి బలపరిచిన ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు నిర్ణయించడం చాలా దురదృష్టకరమని చెప్పారు. రాష్ట్రంలో కుస్తీ ,హస్తినలో దోస్తీ అన్న ట్టుగా ఉందన్నారు. టిడిపి లాలూచీ వ్యవహారం దేశ వ్యాప్తంగా బిజెపి అంటే భారతీయ జనతా పార్టీ కానీ ఆంధ్రప్రదేశ్‌లో బి అంటే బాబు, జె అంటే జగన్ ,పి అంటే పవన్ అని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చెబుతోందన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా మరొక్కసారి నిరూపిత మైందన్నారు. బాబుకు ఓటేసినా బిజెపికి ఓటేసినట్లే ,జనసేనకు ఓటేసినా బిజెపికి ఓటేసినట్లే, జగన్ పార్టీకి ఓటేసినా బిజెపికి ఓటేసినట్లే ఈ వాస్తవాన్ని రాష్ట్ర ప్రజానీకం గుర్తించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లా బకస్, రమణ పాల్గొన్నారు.


రైతులకు విత్తనాలను అందిస్తున్న సర్పంచ్ షరీఫ్

పశుగ్రాసం విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల పరిధిలోని రాయవరం గ్రామ పంచాయితీ పశు వైద్యశాలలో ఆదివారం రైతులకు గ్రామ సర్పంచ్ షరీఫ్ పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. 400 కిలోల జొన్నలు, మొక్క జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, భూమి యాజమాన్య పత్రాలు (పాస్ బుక్),మొబైల్ నెంబర్ ఇచ్చి 5కిలోల ప్యాకెట్ రూ.90 రూ.120 చెల్లించి పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మసీదు కమిటీ ఛైర్మన్ యాషిన్, కమిటీ సభ్యులు మహమ్మద్ ఖాసిం, వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


వృద్ధులకు భోజనాన్ని అందిస్తున్న దాతలు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని మండల పంచాయతీ ప్రేమాలయంలోని వృద్ధాశ్రమంలో ఆదివారం యరపురెడ్డిగారి నాగులమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా కుమార్తెలు, మనవాళ్ల ఆర్థిక సాయంతో ప్రేమాలయంలోని వృద్ధులకు అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో చివరి అంకంలో ఉన్న వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. మా కుటుంబంలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా తమవంతుగా సమాజంలో ఎలాంటి ఆదరణ లేని వారికి ఉపయోగపడే విధంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో వెంకటసుబ్బమ్మ, బాలనాగమ్మ, మనవాళ్లు శివప్రసాద్‌రెడ్డి, మనవరాలు గాయత్రి ప్రేమాలయం సిబ్బంది పాల్గొన్నారు.


పింఛన్లు తొలగించడం దుర్మార్గం

ప్రజాశక్తి-కలికిరి

అర్హులైన వికలాంగుల పింఛన్లు తీసివేయడం కూటమి ప్రభుత్వం దుర్మార్గపు చర్య అని పీలేరు నియోజకవర్గం సమాచార హక్కు చట్టం అధ్యక్షుడు మద్దిరాల మల్లికార్జున పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి అర్హులైన విభిన్నప్రతిభావంతులు, వితంతువులకు, వృద్ధులకు ప్రతి ఒక్కరికి పింఛన్‌ను అందించి ప్రజాభిమానం పొందాడని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న పింఛన్లు కూడా తొలగించడం సరికాదన్నారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారని, ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా వైసిపి ప్రజలు పక్షాన పోరాడుతూనే ఉంటుందని అన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-తంబళ్లపల్లి


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మదనపల్లి పట్టణం పుంగనూరు రోడులో గల గ్రీన్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ లో రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికలు నిర్వహిం చారు. ఈ పోటీలకు మండలంలోని కన్యమడుగుకు చెందిన స్వాతి, ప్రియాంక, రిషిత ఎంపికయ్యారు. ఈ ఎంపిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి సుమారు వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారని జిల్లా కార్యదర్శి గౌతమి తెలిపారు. ఎంపికైనటువంటి క్రీడాకారులు సెప్టెంబర్‌లో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో రాష్ట్రస్థాయి టోర్నమెంట్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ జునైద్ అక్బరీ పాల్గొని క్రీడాకారులు శారీరకంగా మానసికంగా బాగుంటే క్రీడలు చాలా చక్కగా ఆడగా ఆడగలరని తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు ప్రథమ స్థానం తీసుకుని రావాలని ఆకాంక్షించారు. గ్రీన్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం రంగారెడ్డి, క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పించారు. ఎకార్యక్రమంలో ఏషియన్ గోల్డ్ మెడలిస్ట్ యూసుఫ్, అసోసియేషన్ సభ్యులు భారతి, మదనపల్లి మండల స్కూల్ గేస్ట్ కో-ఆర్డినేటర్ శివశంకర్, సెలెక్షన్ కమిటీ కుమార్‌నాయక్ ,జయంత్, తిరుమలేష్ ,పీడీ గురు, మణి, లత, మంజుల ,చిన్నప్ప, మౌనికలు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రాయచోటి : రాష్ట్ర రవాణా, క్రీడా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి,సతీ మణి హరితమ్మ వివాహ వార్షికోత్సవం సందర్భంగా టిడిపి నేత మడితాటి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అపర్ణ ఆస్పత్రి వారిచే మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు రాయుడుకాలనీ టిడిపి నాయకులు రంజిత్ రాయల్ పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని టిడిపి నేత మడితాటి శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించారు. సుమారు 200మంది ఈ శిబిరానికి హాజరయ్యారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, దగ్గు,జలుబు, జ్వరాలు, రక్తహీనత సంబంధిత వ్యాధులతో పాటు దీర్ఘకాలిక నొప్పులు, అస్తమా ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి కావలసిన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్నీ సేవా కార్యక్రమాలు చేపడతామ నివాసులరెడ్డి తెలిపారు.

రోడ్డు అధ్వానం..ప్రయాణం నరకం

- గుంతలమయమైన రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టని అధికారులు


గుంతలమయంగా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సుండుపల్లె గ్రామపంచాయతీలోని జడ్‌పి హైస్కూల్ నుంచి ఎగువ మాలపల్లి వరకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. నిత్యం ఈ రోడ్డులో ట్రాక్టర్లు, జీపులు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మండలంలోని చాకలపల్లి, కుమ్మరపల్లి, పోచంపల్లి, ఎగువ మాలపల్లి, కొత్తడ్లపల్లి, రవీంద్రనగర్ కాలనీ సుమారు ఏడు గ్రామాల ప్రజలు ఈ రోడ్డు ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. పతినిత్యం సుండుపల్లెకు కూరగాయల మార్కెట్, నిత్య సరుకులకు ప్రతినిత్యం వెళుతూనే ఉంటారు. రోడ్డు వర్షం పడి గుంతలు ఏర్పడటంతో వాహనాలు నడిపేటప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉపాధి హామీ పథకం లో మెటల్ రోడ్డు పనులు చేశారు. తారు రోడ్డుగా మార్చేందుకు అప్పటి ప్రభుత్వాలు రూ.60 లక్షల నిధులను కూడా మంజూరు చేయడం జరిగింది. ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతో నిధులు వెనక్కి వెళ్లిపో యాయి.రోడ్డు గుంతలమయంగా మారి పోయింది. వర్షం వచ్చిందే రోడ్డంతా బురదమయమై ఎక్కడ పడిపోతామోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఈరోడ్డుపై వాహనాలను నడపాలంటే కష్టతరంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందు తున్నారు. ఈ సమస్యను పరిష్కరించమని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని గ్రామ ప్రజలు తెలిపారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బండి ఈశ్వర్ సిఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లారని చెప్పారు. స్థానిక ప్రజలు ఎంపిడిఓ సుధాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులుచేసి, శాశ్వతంగా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతున్నారు.

బద్దిపల్లిగుట్టకు దారి సౌకర్యం కల్పించరూ..!


బండరాళ్లతో ఉన్న రోడ్డు

అధికారులకు ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణ సమీపంలోని బద్దిపల్లి వద్ద సర్వే నెంబర్ 1022 బద్దిపల్లి గుట్ట కాలనీ నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించింది. అందులో గృహాలు లేని నిరుపేదలకు ఇళ్లు పథకంలో భాగంగా అర్హులకు ఇంటి స్థలాలను మంజూరు చేశారు.దీంతో లబ్ధిదారులు శరవేగంగా ఇంటి నిర్మాణ పనులు చేపట్టారు. పనులు శరవేగంగా జరుగుతూ పునాదులు, గునాదులు తీయడంతో గృహాలు నిర్మిస్తున్న లబ్ధిదారులు సరైన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు.దీనిపై హౌసింగ్ అధికారులు స్పందించి రోడ్డు వేస్తామని తూతూమంత్రంగా వచ్చి చూసి వెళ్లారు. ఈరోజుకి రోడ్డు పరిస్థితి పట్టించుకోలేదని బద్దిపల్లి గుట్ట కాలనీ వాసులు తెలిపారు.రోడ్డు సౌకర్యం లేక గృహ నిర్మాణానికి పరికరాలు ఇసుక,రాయి,సిమెంట్ తీసుకు వెళ్లాలంటే వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది.అధికారులు ప్లాట్లు కేటాయించారేగానీ, రోడ్డు సౌకర్యం కల్పించడం మరిచారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో గృహాలు నిర్మాణాలు చేయడానికి వారికి ఏం చేయాలో బోధపడలేదు,రోడ్డు లేక కేటాయిం చిన స్థలాల్లో పెద్దపెద్ద రాతి బండలో ఉండడంతో జెసిపి గానీ,ట్రాక్టర్స్ గాని ఎలా రావాలో తెలియక,ఎలా కొండ ఎక్కాలో తెలియక సతమత మవుతున్నారు. ఇప్పటికైనా లబ్ధిదారులు సౌకర్యం కోసం ముందుగా రోడ్డు ఏర్పాటు చేయాలని గృహాలు నిర్మిస్తున్న లబ్ధిదారులు ప్రజాశక్తి తెలిపారు.సంబంధిత గృహనిర్మాణ శాఖ వారు ఫ్లాట్ కేటాయించిన కాలనీకి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, రోడ్డుతోపాటు వీధి దీపాలు, గృహనిర్మాణాల కోసం నీరుని అందించాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు. హౌసింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరుతున్నారు.

వైసిపి నుంచి టిడిపిలోకి చేరికలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని బొజ్జవారిపల్లె పంచాయతీ పరిధిలో గల దాదివాండ్లపల్లి, వడ్డీ, దళితవాడ లోని వైసిపి నాయకులు నందలూరు సుబ్రమణ్యంరెడ్డి ఆధ్వర్యంలో నందలూరు కుటుంబాలకు చెందిన 200 కుటుంబాలు కుడా చైర్మన్, టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి నేతృత్వంలో టిడిపికిలోకి చేరారు. ముక్కా రూపానంద రెడ్డి దాదివాండ్ల పల్లెకు రాగానే గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వైసిపి పాలనపై విసుగెత్తి అభివృద్ధి కోసం, ప్రజా సంక్షేమం కోసం చంద్రబాబు నేతృత్వంలోని టిడిపి వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు.రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రజల భవిష్యత్తు కోసం టిడిపినే సరైన వేదికగా గుర్తించి భారీగా ప్రజలు చేరిక అవుతున్నారని, రాబోయే రోజుల్లో చాలా మంది వైసిపిని వీడి టిడిపిలోకి చేరే అవకాశం ఉందని అన్నారు. వైసిపి నుంచి టిడిపిలో చేరిన వారిలో నందలూరు కుటుంబాలకు చెందిన శ్రీనివాసులరెడ్డి, సింగమాల వెంకట్‌రెడ్డి, సింగమాల రామసుబ్బారెడ్డి, సింగమాల సుబ్రహ్మణ్యంరెడ్డి. చిన్నపోలు జయరామిరెడ్డి, నరసింహారెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, సుబ్బరామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రూపానందరెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

విద్యాలయాలు భవిష్యత్తుకు పునాదులు :'చమర్తి'


జగన్‌మోహన్‌రాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-రాయచోటి

విద్యాలయాలు విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులుగా ఉపయోగపడతాయని, ప్రతి గురువు ఒక లైబ్రరీ లాగా విద్యార్థులకు ఉపయోగపడతారనీ,అందుకే ప్రతి విద్యార్థి గురువులను గౌరవించాలని రాజు విద్యాసంస్థల అధినేత,రాజంపేట టిడిపి ఇంచార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని రాజు విద్యాసంస్థల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రాజు విద్యాసంస్థలతో తమకున్న అనుబంధాన్ని, ఆత్మీయతను, యాజమాన్యం అందిస్తున్న సహకారాన్ని,రాజు విద్యాసంస్థల్లో విద్యార్థులు సాధిస్తున్న విజయాల గురించి తమ అనుభూతులను పంచుతున్నారు. అనంతరం చమర్తి మాట్లాడుతూ విద్యాలయాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా పునాదులు వేస్తాయని, విద్యార్థులకు విద్య నేర్పే గురువు వారి భవిష్యత్తుకు బంగారు బాట వేస్తారని, అందుకే రాజు విద్యాసంస్థల్లో విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా బోధన ఉంటుందన్నారు. విద్యాసంస్థల్లో పనిచేసే ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు లాంటివారన్నారు. అనంతరం రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు జగన్‌మోహన్‌రాజును సన్మానించారు. కార్యక్రమంలో రాజు విద్యాసంస్థల వ్యవస్థాపకులు సుబ్బరాజు, కరస్పాండెంట్ చమర్తి శోభా, ప్రిన్సిపల్ శంకర్‌నారాయణ, వంశీకృష్ణ, రమణయ్య, హెడ్మాస్టర్ సదాశివ గోపికృష్ణ, ఆనంద్ ,రఘురామరాజు, మోహన్ రెడ్డి, రెడ్డప్ప, అనిల్, లలిత, ఉమా, సెంట్రల్ అకాడమిక్ హెడ్ షెడ్యూల్ రాధమ్మ, అనిత, రాజు విద్యాసంస్థల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు చోరీపై కాంగ్రెస్ నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-పీలేరు

ప్రజాస్వామ్య పరిరక్షణ కోరుకుంటూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "ఓట్ చోర్ – గద్దీ చోడ్" ఉద్యమంలో భాగంగా ఆదివారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ, ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసన ర్యాలీ, క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డి స్థానిక అంబేద్కర్ సర్కిల్లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని విచ్చిన్నం చేస్తూ మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందని గత ఎన్నికల్లో ఎన్నికల కమిషన్‌తో కలిసి దొంగ ఓట్లతో బిజెపి ప్రభుత్వం కుమ్మక్కయ్యిందని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన పూర్తి సాక్ష్యాధారాలను రాహుల్ గాంధీ స్వయంగా బెంగళూరులో జరిగిన మీడియా సమావేశంలో 90 నిమిషాలపాటు వివరించారన్నారు. ఉన్న ఓట్లు తొలగించి, లేని ఓట్లు కలిపి ఎన్నికల్లో గెలపొందారని లోక్‌సభలో రాహుల్‌గాంధీ విమర్శిస్తూనే వస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని కాపాడుతు ందని, ఓటరు హక్కులను మన చివరి శ్వాస వరకు కాపాడుతుందని తెలియ జేశారు. ఎన్ఎస్‌యుఐ అమృత తేజ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు స్థానిక అంబేద్కర్ సర్కిల్లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ యుఐ రాష్ట్ర నాయకులు అమృత తేజ, జిల్లా అధ్యక్షులు సాయిసంపత్ కుమార్, లోకేష్, గురు, రెడ్డి, కాంగ్రెస్ నాయకులు యూసఫ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బిజెపి గుప్పిట్లో కేంద్ర ఎన్నికల సంఘం : రెడ్డి సాహెబ్

బిజెపి గుప్పిట్లో కేంద్ర ఎన్నికల సంఘం పావుగా మారిందని, రాజ్యాంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మదనపల్లె కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రెడ్డిసాహెబ్ ఆరోపించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలు దేశం మనుగడకు ప్రమాదకరమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన, వైసిపి మద్దతునిస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నాయన్నారు. ఎన్నికల సంఘాన్ని తన ఆధీనంలోకి తీసుకొని ఓట్ల దొంగతనం, ఓటర్ల జాబితాను తారుమారు చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యంగా ఒకే కుటుంబంలో 50 ఓట్లు ఉండడం, ఓట్లు తారుమారు పాల్పడడం జరుగుతోందన్నారు. దీనిని బట్టి చూస్తే కేంద్రంలో బిజెపి ఎలా అధికారంలోకి వస్తోందో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చునన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ప్రజాపిత బ్రహ్మర్షి ఈశ్వరీయ విశ్వ విద్యాలయ సంచాలకులు పద్మావతి అన్నారు. ప్రకాశ్మణీ 18వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక కోటగడ్డ లోని కార్యాలయంలో విశ్వ బంధుత్వ దినం జరుపుకున్నారు. మెగా రక్తదాన శిబిరం నిర్వహించగా పలువురు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సేవాకేంద్ర సంచాలకులు పద్మావతి మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితుల్లో, శస్త్ర చికిత్సలకు, ప్రమాద సమయాల్లో ఒక్కొక్క రక్తం చుక్క కూడా ప్రాణాలను నిలబెడుతుందన్నారు. అలాంటి రక్తం దానం చేయడం మహా పుణ్యం అని తెలిపారు. ముఖ్యంగా యువత అగ్రభాగాన నిలిచి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని కోరారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. కార్యక్రమంలో సుబ్రమణ్య భారక స్వామీజీ, రెడ్ క్రాస్ సెక్రటరీ డీఆర్ జగదీష్, వాలంటరీ బ్లడ్ సెంటర్ ఇంచార్జ్ బాలచంద్రం, గ్రామజ్యోతి సుభద్ర, భానుప్రకాష్, గురుమూర్తి, కౌన్సిలర్ తులసమ్మ పాల్గొన్నారు.


కడపలో సన్మానం అందుకుంటున్న ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ

ఘన సత్కారం అందుకున్న 'గంగనపల్లి'

ప్రజాశక్తి- నందలూరు

తెలుగు భాష సాహిత్యానికై కృషి చేస్తున్న నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి జడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ కడప సిపి బ్రౌన్ గ్రంథాలయంలో ఆదివారం ఘన సత్కారం అందుకున్నారు. ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా ఆర్‌యుపిపి తెలుగు భాషా దినోత్సవ ముందస్తు వేడుకలను సి.పి. బ్రౌన్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించింది. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి తెలుగులో నూటికి నూరు మార్కులు సంపాదించిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఆర్‌యుపిపి రాష్ట్ర బాధ్యులు ఘనంగా సత్కరించారు. పండిత పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు నిమ్మగడ్డ సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం రవిచంద్ర, రాష్ట్ర బాధ్యులు రమేష్, శివారెడ్డి, నరసింహారెడ్డి, పద్మనాభయ్య, జిల్లా అధ్యక్షులు ఖాదర్, వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి తదితరుల చేతుల మీదుగా ఆయన సన్మానం అందుకున్నారు. ఈ సందర్భంగా శాలువా, పూలమాల, జ్ఞాపికలతో వారు గంగనపల్లి వెంకటరమణను ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో జిల్లాకు చెందిన పండిత పరిషత్తు నాయకులు, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరలో టైటానిక్ షిప్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక పట్టణంలోని టిప్పుసుల్తాన్ మైదానంలో ఆదివారం డిజె.ఎగ్జిబిషన్ యజమాని సికె.దినేష్ కుమార్ టైటానిక్ షిప్ ఎగ్జిబిషన్ పనులను ప్రారంభించారు. ధ్వజస్తంభం ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ పూజా కార్యక్రమంలో ఎగ్జిబిషన్ కో-ఆర్డినేటర్, సీనియర్ జర్నలిస్ట్ కలకడ వేణుగోపాల్, జనరల్ మేనేజర్ రవీంద్రనాథ్, నిఖిల్ సాయి, మేనేజర్ అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీ.కే.దినేష్ కుమార్ మాట్లాడుతూ మదనపల్లెలో 24 ఏళ్లుగా డిజె ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. టైటానిక్ షిప్ ఎగ్జిబిషన్ ప్రజలందరినీ ఉల్లాస పరస్తుందన్నారు.

క్రైం కార్నర్


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

లారీ రికవరీ.. ఇద్దరు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

14 చక్రాల లారీని దొంగలించుకొని పారిపోయిన ఇద్దరు నింధితులను ఆదివారం అరెస్టు చేసినట్లు వాల్మీకిపురం సిఐ రాఘవరెడ్డి తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుర్రంకొండ టమేటా మార్కెట్‌లో టమేటా వ్యాపారి బాబా జాన్‌కు చెందిన 14చక్రాల లారీని ఇద్దరు వ్యక్తులు రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా దొంగలించుకొని వెళ్లారు. అంతే కాకుండా పీలేరు టోల్‌ప్లాజా దగ్గర లారీని ఉంచి, అందులో ఉన్న డీజిల్‌ను తీసుకొని అమ్మేసినట్లు తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన సిఐ రాఘవ రెడ్డి, గుర్రంకొండ పోలీసులు సిసి కెమెరాల ద్వారా లారీ ఉన్న స్థలాన్ని కనుకొని, దొంగలించుకొని వెళ్లిన ఇద్దరు నిందితులు నాగరాజ, సిద్దు హుసేన్‌లను అరెస్ట్ చేసి, లారీని, 20లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. అనంతరం సిఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో దొంగతనాలు, దోపిడీలు జరగకుండా నిఘా ఉంచుతామన్నారు. దొంగతనాలు, దోపిడీలు చేసి అరెస్ట్ అయ్యి, శిక్ష అనుభవించే దానికన్నా, ఉపాధి హామీ పనులు లేదా ఏదైనా కూలి పనులు చేసుకొని, సుఖంగా జీవించాలని, దొంగతనాలు చేసే ముందు ఇంట్లో ఉన్న తల్లిదండులు, భార్య పిల్లలను గుర్తు చేసుకొని సమాజంలో మంచిగా బ్రతకాలని సూచించారు. కార్యక్రమంలో గుర్రంకొండ ఎస్ఐ రఘురాం, సిబ్బంది పాల్గొన్నారు.

11 మంది పేకాటరాయుళ్లు..

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో రెండు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 11 మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు...ఆదివారం అగ్రహారం గ్రామంలో ఆరుగురు, కొత్తపల్లి గ్రామంలో ఐదుగురు వ్యక్తులు కలిసి పేక ముక్కలతో జూదం ఆడుతూ ఉండగా సమాచారం అందుకున్న ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. జూదం ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.11,300లు నగదును స్వాధీ నం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్య కలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీ కొట్టి విద్యార్థి తీవ్ర గాయపడిన సంఘటన శనివారం అర్ధరాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. తాలుకా పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా, పుంగనూరు మండలం, ఈడిగపల్లెకు చెందిన రైతు శ్రీనివాసులు కుమారుడు గౌతమ్(19) మదనపల్లెలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువు తున్నాడు. రాత్రి పొద్దుపోయేవరకు మదనపల్లె లోని స్నేహితుడి వద్ద ఉన్న గౌతమ్ అర్ధరాత్రి ద్విచక్ర వాహనంలో ఇంటికి బయల్దేరాడు. మార్గ మధ్యంలోని గ్రీన్ వ్యాలి స్కూల్ సమీపంలోని డాబా వద్ద రోడ్డు పక్కగా నిలిపి ఉన్న లారిని గౌతమ్ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో గమనించిన స్థానికులు బాధితున్ని వెంటనే 108 లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం అతని పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగుళూరు కు రెఫర్ చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-కలకడ

మనస్థాపానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలములో జరిగింది.స్థానిక పోలీసులు తెలిపిన సమాచారం మేరకు..మండలంలోని గంగాపురం పంచాయతీ రాగప్పగారిపల్లికు చెందిన ముల్లగూరి సోమశేఖర(54)కు సుమారు మూడు ఎకరాల పైచిలుకు భూమి ఉన్నట్లు తెలిపారు.ఈ క్రమంలో తన చెల్లికి గతంలో ఆ భూమిని మొత్తం రాయించినట్లు తెలిపారు. సోమశేఖర తన చెల్లికి రాయించిన భూమిని తనకు తిరిగి రాయించమని చెల్లెలను బ్రతిమలాడినట్లు తెలిపారు. తన చెల్లి తన అన్న తనకు రాయించి ఇచ్చిన పొలాన్ని తిరిగి రాసిచెప్పడంతో మనస్తాపం చెందిన సోమశేఖర తన పొలం వద్ద ఉన్న గడ్డి మందును ఈనెల 23న ఉదయం సేవించినట్లు తెలిపారు. గడ్డి మందు సేవించిన విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా వైద్యశాలకు తరలించి, చికిత్స చేయిస్తున్న తరుణంలో 24న రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడు సోమశేఖర భార్య చిన్నమ్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.